# నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ టెలికాం ఎంప్లాయిస్

బి.ఎస్.ఎన్.ఎల్. (రిజిష్టర్ నెం. 4906)

తెలంగాణ సర్కిల్ బ్రాంచ్ - హైదరాబాద్.

సర్క్యులర్ నెం.15/2025 తేది. 22-02-2025

**డియర్ కామ్రేడ్స్,**

ఈ మధ్యలో కొందరు బాధ్యత కలిగిన యూనియన్ నాయకులు వారి ఇష్టారీతిలో వాట్సప్‌లో వ్రాస్తున్నారు. అది వారి విచక్షణకు వదిలివేస్తున్నాను. మొదట థర్డ్ వేజ్ రివిజన్ రాకపోవడానికి కారణం ఎన్.ఎఫ్.టి.ఇ. సహకరిస్తలేదని కరపత్రాలు పంచారు. వాస్తవాలు వ్రాయండి. వేజ్ రివిజన్ ఒక గుర్తింపు కలిగిన యూనియన్‌తో సాధ్యపడుతుందా? అగ్రిమెంటుకు దగ్గరలోకి వచ్చినప్పుడు హెచ్.ఆర్.ఎ. సమస్యను రాద్ధాంతం చేసిందెవరు? తవ్వితే పెంకాసులు వస్తాయని గుర్తించాలి. (2) ప్రతి యూనియన్‌కు ఒక కానిస్ట్యూషన్ వుంటుంది. దాన్ని అనుసరించి పనిచేస్తాము తెలియాలి. క్రమశిక్షణా చర్య అన్నింటిలో వుంటుంది, మీకు తెలుసు. దాన్ని అనుసరించి మీరు ఎంత మందిపై చర్య తీసుకున్నారో మీకు తెలియదా? అదే ఎన్.ఎఫ్.టి. చేస్తే నిరంకుశత్వం అన్నారు. మరి మీకు చేసింది ఏమనాలి? మీకే వదిలి వేస్తాను. (3) సభ్యుడు స్వతంత్రుడు వారికి నచ్చిన యూనియన్‌లో వుంటారు. అది వారి ఇష్టం. అంతే కానీ గోరంతలు కొండతలుగా వ్రాసి గొప్ప అనిపించుకోవడం మీకు వెన్నతో పెట్టిన విద్య. మరి ఈ మధ్యలో హైదరాబాద్ అంతా తిరిగి ఎన్.ఎఫ్.టి.ఇ. అధ్యక్షులు మీ యూనియన్‌లో చేరినారని చాటింపు చేస్తున్నారు. కానీ వాస్తవం ఏమిటి? సభ్యులు గ్రహించాలి. మా రాష్ట్ర అధ్యక్షులు మా అందరికంట బాగుగా పనిచేస్తున్నారనేది వాస్తవం. అది మింగుడు పడక రాద్ధాంతాలు మానుకుంటే మంచిది. ఇంతకు పూర్వము మీ యూనియన్ నుండి చాలా మంది సభ్యులు ఎన్.ఎఫ్.టి.ఇ.లోకి వచ్చారు. మేము చాటింపు చేయలేదే అది మీకు తెలియదా? ఒకటి గుర్తుంచుకోవాలి. ఒక వ్రేలు ఎదుటివారిని చూపిస్తే, మూడు వ్రేళ్ళు మనలను చూపిస్తాయి. అందుకే ఇవన్నీయూ మీ విజ్ఞతకు వదిలేస్తాను. నాయకత్వాలలో పరిపక్వత వుండాలి. లేనిచో ఇవన్నీ వస్తుంటాయి, వాస్తవం. కుటుంబం అన్నప్పుడు హెచ్చుతగ్గులుంటాయి. వాటిని భూతద్దంలో చూస్తే పురుగులు కనబడుతాయి.

2. తేది. 22-01-2025 న హైదరాబాద్‌లో పనిచేసిన సీనియర్ నాయకుడు కా॥ డి. రాంబాబు గారు 85 సం॥ల వయస్సులో మనందరినీ విడిచి వెళ్ళినారు. వారిలేని లోటు తీరనిది, వారి కార్యదీక్షత, పట్టుదలపై ఎంత వివరించినా తక్కువే. వారికి లైన్‌మెన్లు మజ్దూర్లు అంటే చాలా ప్రేమ, వారు సమస్యలను చాలా గట్టిగా తెలిపేవారు. వారు పనిచేసే కసి, తక్కువ మందిలో చూస్తాము. యూనియన్ సమావేశాలు జరిగునప్పుడు వారి చేసే సేవలు మరువరానివి. సిటీలో వున్న ఎక్స్ఛేంజ్‌ల వివరాలు వారి వద్ద డిక్షనరీలాగా వుండేది. వారు నడిపే సైకిల్, టి.వి.ఎస్‌లపై హైదరాబాద్ మొత్తం కలియతిరిగేవారు. వారికి భార్య నలుగురు కూతుర్లు వున్నారు. తేది. 28-01-2025న హైదరాబాద్ జిల్లా యూనియన్ వారు సంతాపసభ పెట్టి వారికి ఘన నివాలులు అర్పించారు. వారి మరణానికి సర్కిల్ యూనియన్ ప్రగాఢ సంతాపాన్ని తెలియచేస్తూ, వారి కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని ఇవ్వాలని ఆ దేవున్ని ప్రార్థిస్తున్నాను.

3. పెరిగిన ఐ.డి.ఎ.పై కార్పోరేట్ ఆఫీసు తేది. 07-02-2025న ఆర్డర్లు ఇచ్చినది.

4. జి.టి.ఐ.పై తేది. 06-02-2025న సమావేశం జరిగినది. గత సంవత్సరం పద్ధతిలోనే వుంటుంది. కానీ ఈ సారి ఆత్మహత్యలు చేసుకొని మరణించిన వారికి కూడా వర్తింపజేస్తామని చెప్పినారు. పెండింగులో వున్న జి.టి.ఐ. కేసులు ఈ నెలాఖరున చెల్లింపచేస్తామని తెలియజేశారు.

5. తేది. 30-01-2025న సర్కిల్ కార్యవర్గ సమావేశము కా॥ బి. సునిత గారి అధ్యక్షతన కాచీగూడలో జరిగింది. తేది. 26-12-2024న మహబూబ్‌నగర్‌లో జరిగిన సమావేశం తరువాత ఇది నిర్ణయించడమైనది. దీనిలో మొదటిగా

కా॥ దుర్గారావు జిల్లా కార్యదర్శి ఖమ్మం మరియు వారి మిత్ర బృందానికి ధన్యవాదములు తెలియజేయుట జరిగినది. వారు సర్కిల్ సభలు చాలా హుందాగా నిర్వహించారు. ఆ తరువాత కా॥ వి.కె. ముత్తు సర్కిల్ ఉపాధ్యక్ష పదవికి రాజీనామా చేయగా, సభ ఆమోదించింది. వారి స్థానములో కా॥ పి. పరంజ్యోతి, జె.ఇ. రిటైర్డ్ గారిని ఎన్నుకోవడం జరిగింది. అదే విధంగా ఖాళీగా ఉన్న స్థానాలలో కా॥ పి. అంజనేయులు,టి.టి. రిటైర్డ్ గారిని, ఎ.సి.ఎస్.-I గా, కా॥ వెంకటేశ్వరమ్మ టి.టి. గారిని సర్కిల్ నిర్మాణ కార్యదర్శిగా ఎన్నుకోవడం జరిగింది. ఇంకా ఖాళీగా వున్న ఎ.సి.ఎస్. పోస్టులో కా॥ నాగేంద్ర ప్రసాద్ జె.ఇ. సంగారెడ్డి గారిని ఎ.సి.ఎస్.గా ఎన్నుకోవడం జరిగింది. సర్కిల్ కార్యదర్శి మాట్లాడుతూ 3వ వేజ్ రివిజన్‌పై వివరాలు చెప్పినా ఎవ్వరూ సంతృప్తి చెందలేదు. అది వాస్తవం. 2వ వి.ఆర్.ఎస్.పై రకరకాలుగా వార్తలు వస్తున్నాయి. కానీ 2వ వి.ఆర్.ఎస్. డి.ఓ.టి. ఆఫీసులో పెండింగులో వున్నది. ఒక వేళ కేంద్ర ప్రభుత్వం రూ. 15 వేల కోట్లు ఇస్తే అది వస్తుంది. లేనిచో కష్టమే. 3వ వేజ్ రివిజన్‌పై తేది. 10-03-2025న సమావేశం జరుగునని తెలిసింది. దానిలో మంచి జరగాలని ఆశిద్దాం. సమావశములు సజావుగా జరగడానికి మన సర్కిల్ అధ్యక్షులు, కా॥ వేణుగోపాలు సర్కిల్ నిర్మాణ కార్యదర్శి, కా॥ కిషన్ ఎ.టి.టి., కా॥ నాగరజు జె.ఇ, కా॥ ప్రసన్న మరియు కా॥ జి.కె. హనుమంతరవు గార్లు సహకరించారు. వారికి సర్కిల్ యూనియన్ ధనన్యవాదములు తెలియజేస్తున్నది.

6. కేంద్ర ప్రభుత్వం ఇప్పుడున్న కార్మిక చట్టాలను కుద్దించి 4 లేబర్ కోడ్‌లను ఏప్రిల్ 2025 నుండి అమలు చేయాలని ప్రయత్నంలో వున్నది. దాని వల్ల ఇప్పుడు కార్మికులు పొందుతున్న హక్కులన్నీ హరించుకుపోతాయి. దీనిని వ్యతిరేకిస్తూ, ఢిల్లీలో తేది. 18-03-2025న నేషనల్ కన్వెన్షన్ జరగనున్నది. దానిలో దేశమొత్తంలో సమ్మె చేయాలనే నిర్ణయం తీసుకోబోతున్నారు.

7. ఇప్పుడున్న మన సి.ఎం.డి. గారి పదవీ కాలాన్ని మరో 6 నెలలు (తేది. 15-01-2025 నుండి 04-07-2025 వరకు) పొడిగించారు. వీరు బి.ఎస్.ఎన్.ఎల్.కే కాకుండా ఎం.టి.ఎన్.ఎల్., బి.బి.ఎన్.ఎల్.లకు కూడా సి.ఎం.డి.గా వ్యవహరిస్తారు.

8. సంగారెడ్డి జిల్లా 7వ వార్షిక సమావేశములు తేది. 18-02-2025న జి.ఎం. ఆఫీసు ఆవరణలో జరిగినవి. ఈ సమావేశాలకు సీనియర్ నాయకులు, పెన్షనర్ నాయకులతో కలిసి సర్కిల్ కార్యదర్శి, సర్కిల్ అధ్యక్షులు, మరియు సర్కిల్ సహాయ కార్యదర్శులు హాజరైనారు. ఈ సమావేశములో కా॥ అబ్దుల్ రషీద్ గారు, జిల్లా అధ్యక్షులుగా, కా॥ వి. ధనుంజయ రావు గారు, జె.ఇ, జిల్లా కార్యదర్శిగా మరియు కా॥ సత్యనారాయణ రెడ్డి గారు, జిల్లా కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నికైనారు. వీరికి సర్కిల్ యూనియన్ శుభాభి వందనములు తెలియజేస్తున్నది.

9. సర్కిల్ ఆఫీస్, జిల్లా బ్రాంచ్ వార్షిక సమావేశము తేది. 21-02-2025న కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగింది. ఈ సమావేశాలకు రాష్ట్రంలోని సీనియర్ నాయకులు, హైదరాబాద్, సంగారెడ్డి జిల్లా నాయకులు, కా॥ బి.నాగేంద్ర బాబు సర్కిల్ కార్యదర్శి ఆంధ్రప్రదేశ్, మరియు తెలంగాణ సర్కిల్ కార్యదర్శి, సర్కిల్ అధ్యక్షులు హాజరై ప్రసంగించినారు. ఈ సమావేశాలకు ఒక ప్రత్యేకత ఉన్నది. మన సి.జి.ఎం.టి. గారైన శ్రీ జి. రత్నకుమార్ గారు మరియు మహేందర్ రావత్ జి.ఎం.(హెచ్.ఆర్.) గారు హాజరై ప్రసంగించారు. వారికి కృతజ్ఞతలు. కా॥ జి.కె. హనుమంత్ రావు గారు జిల్లా అధ్యక్షులుగా, కా॥ బి. గీత జిల్లా కార్యదర్శిగా, కా॥ పి. శ్రీనివాస్ గారు జిల్లా కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నికైనారు. వీరికి సర్కిల్ యూనియన్ శుభాభివందనములు తెలియజేస్తున్నది.

భవదీయుడు

(ఎ. రాజమౌళి)
సర్కిల్ కార్యదర్శి

**ఎన్.ఎఫ్.టి.ఇ. జిందాబాద్ - కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి - లాంగ్ లీవ్ బి.ఎస్.ఎన్.ఎల్.**